అట్టహాసంగా కె.కె.రాజు నామినేషన్


44వ వార్డు నుంచి బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివెళ్తున్న కార్యకర్తలు


రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో కలిసి భారీ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు.. సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజులకు గజమాల వేస్తున్న పార్టీ శ్రేణులు(ఇన్‌సెట్)

- ఆలయాల్లో సతీసమేతంగా ప్రత్యేక పూజలు
- ర్యాలీలో అడుగడుగునా జన నీరాజనాలు

సీతమ్మధార/మద్దిలపాలెం/సీతంపేట/కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు నామినేషన్ కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో జన ప్రభంజనం మధ్య సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను ఉత్తర రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిలకు కె.కె.రాజు అందజేశారు. శుక్రవారం ఉదయం బెల్లం వినాయకుడు, కనకమహాలక్ష్మి, లలితానగర్ లలితాదేవి, తాటిచెట్లపాలెం పరదేశమ్మ, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామిని ఆలయాల్లో కె.కె.రాజు దర్శించుకున్నారు. ఆర్ అండ్ బీ దరి మారియట్ హోటల్ వద్ద పైడిమాంబ అమ్మవారిని, ఎన్‌జీజీవోఎస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామిని సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అతిథిగా వైవీ సుబ్బారెడ్డి ప్రచార ర్యాలీ వాహనంలో కె.కె.రాజుతోపాటు పాల్గొన్నారు. వేలాది మంది పార్టీ శ్రేణులతోపాటు బైక్ ర్యాలీగా సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, డీఎల్‌బీ గ్రౌండ్, అక్కయ్యపాలెం మీదుగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తీన్మార్ డప్పులు, నిండు బిందెలతో కళాకారులు సంప్రదాయ రీతిలో కె.కె.రాజుకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయనకు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు ప్రపోజ్ చేశారు. కె.కె.రాజు సతీమణి కమ్మిల సుమ మరో నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, బాలరాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, చల్ల రజని, బొడ్డేటి కాశీవిశ్వనాథ్, పేడాడ రమణికుమారి, పీలా వెంకటలక్ష్మి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, పి.ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, వి.ప్రసాద్, బర్కత్ అలీ, కె.వి.ఎస్.శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు జి.వి.రవిరాజ్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, శైలేష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, నెడ్‌క్యాప్ మాజీ మెంబర్ ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, దల్లి రామకృష్ణరెడ్డి, చందు, తిప్పల దేవన్‌రెడ్డి, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు, గృహ సారథులు భారీగా పాల్గొన్నారు.


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పార్టీ కార్యాలయం వద్ద డప్పులు వాయిస్తూ.. నీటి బిందెలతో కె.కె.రాజుకు స్వాగతం పలుకుతున్న కళాకారులు

స్వచ్ఛందంగా నామినేషన్ ర్యాలీకి..

పలు వార్డుల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా.. ఉత్సాహంగా నామినేషన్ ర్యాలీకి తరలివెళ్లి కె.కె.రాజుకు మద్దతు తెలిపారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, పార్టీ యువ నాయకుడు బాణాల తరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, ప్రజలు భారీ ర్యాలీగా వెళ్లారు.

సీఎం జగన్ ప్రోత్సాహంతో 'ఉత్తర' అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను చాలా ప్రోత్సాహించారని ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. నామినేషన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పునర్జన్మనిచ్చిన తమ నాయకుడికి భారీ మెజారిటీతో గెలిచి ఎమ్మెల్యే పదవిని గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. చంద్రబాబుకు తొత్తులుగా ఒక జాతీయ పార్టీ, ఒక లోకల్ పార్టీ మారాయన్నారు. విశాఖపై స్పష్టమైన విజన్ కలిగిన నాయకుడు జగన్ అని అన్నారు. సరిగా సీట్లు కూడా సర్దుబాటు చేసుకోలేని కూటమి నాయకులు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయగలరని, చేసింది చెప్పుకోలేక, ఏం చేస్తారో కూడా చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో వారు ఉన్నారని విమర్శించారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా చేసి చూపించిన అభివృద్ధి తమ గెలుపునకు మంత్రమన్నారు. ఉత్తర నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎన్ని కూటములు వచ్చినా.. 45 వేల మెజారిటీతో తాను గెలవడం తథ్యమని కె.కె.రాజు అన్నారు. సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజులకు క్రేన్ సాయంతో భారీ గజమాల వేశారు.

క్లుప్తంగా

చైత్ర పౌర్ణమి పూజలకు సిద్ధం

- 22న రథోత్సవం
- ప్రధాన జాతరకు ఏర్పాట్లు


అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

కంచరపాలెం: చైత్రమాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 22 సోమవారం సుబ్రహ్మణ్యస్వామి చైత్ర పూర్ణిమ మహోత్సవాలు కార్తికేయ శరవణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం ఊర్వశికూడలి రవీంద్రనగర్ సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో కలశ స్థాపన, విఘ్నేశ్వరపూజ, మండపరాధన, ముత్తయిదువుల చేతులమీదుగా ఊంజల సేవ ఉంటుందన్నారు. అనంతరం క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. స్వామివారిని సాయంత్రం ఊర్వశికూడలి ఆలయం నుంచి కంచరపాలెం నేతాజీ కూడలి వరకు తిరుగు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద చలివేంద్రాలు, అన్న ప్రసాద వితరణలకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతంపేట: సంఘం ఆఫీస్, రామాలయం 11కేవీ ఫీడర్లు తాటిచెట్లపాలెం సెక్షన్‌లోకి తరలింపు కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు దాలిరాజు సూపర్ మార్కెట్ ఏరియా, జగ్గారావు బ్రిడ్జి, యలమంచిలి వారి వీధి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ప్రాంతం, పాత పోస్టాఫీస్, మహారాణి పార్లర్, శివరామరెడ్డి స్వీట్ షాప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఆశీలమెట్ట సెక్షన్‌లో..

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ టీపీటీ కాలనీ ఫీడర్, 11 కేవీ ఏఎస్సార్ నగర్ ఫీడర్లలో నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టీపీటీ కాలనీ, ఎన్‌బీఎం లా కళాశాల ప్రాంతం, రసపూర్ణ హోటల్ వెనుక ప్రాంతం, ఏఎస్సార్ నగర్, క్షత్రియ కల్యాణ మండపం, బిలాల్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

21, 22 తేదీల్లో సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం

మద్దిలపాలెం: సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నామని ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధి డి.సుబ్రహ్మణ్యం వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాల వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులు, వెన్నుముక నొప్పి, మెడ నొప్పి, భుజాల నొప్పి, కీళ్ల నొప్పులు సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మీ ఆశీర్వాదంతోనే.. నా గెలుపు


24వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల ప్రచారంలో ఆత్మీయ స్వాగతం

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 24వ వార్డులో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నక్కవానిపాలెం, క్రాంతినగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. అభివాదం చేస్తూ తనను ఆశీర్వదించి మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అడుగడుగునా ఆయనకు స్థానికులు పూలు, హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.సురేష్‌రాజు, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజ్, జి.వి.రమణి, బాక్సర్ రాజు, కో–ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, కార్పొరేటర్లు వి.ప్రసాద్, బర్కత్ అలీ, జేసీఎస్ కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, అమర్‌రెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు, సాడి పద్మారెడ్డి


శాంతినగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కె.కె.రాజును ఎమ్మెల్యే చేద్దాం

కంచరపాలెం: ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు విజయానికి ప్రజలు సహకరించాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కోరారు. 46వ వార్డు శాంతినగర్‌లో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన కె.కె.రాజును ఎమ్మెల్యేగా, బొత్స ఝూన్సీని విశాఖ ఎంపీగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్'పై చిత్రలేఖన పోటీలు రేపు

మద్దిలపాలెం: ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎకో వైజాగ్‌లో భాగంగా ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న చిత్రలేఖన పోటీలను జయప్రదం చేయాలని ఏపీ పీసీబీ సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ జి.నాగిరెడ్డి పిలుపునిచ్చారు. పీసీబీ కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న మాధవధార కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో చిత్రలేఖన పోటీలు జరుగుతాయని తెలిపారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. డ్రాయింగ్ షీట్లను పీసీబీ ఇస్తుందని చెప్పారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ముకుంద మాట్లాడుతూ 1970లో మొట్టమొదటి ధరిత్రి దినోత్సవం అన్ని వర్గాల నుంచి లక్షల మందిని పర్యావరణ పరిరక్షణకు సమీకరించిదన్నారు. అప్పటి నుంచి ఎర్త్‌డే రూపుదిద్దుకుందన్నారు. సమస్త జీవరాశిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాలుష్య మండలి ఇంజినీర్లు వీరేంద్రకుమార్, కరుణరేఖ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, వలంటీర్ రవితేజ, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీసీబీ ఇంజినీర్లు, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధులు

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు


డ్రాయింగ్స్‌ను చూపుతున్న విద్యార్థులు



సర్టిఫికెట్లతో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల విజేతలు

సీతంపేట: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా విద్యార్థులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 6 నుంచి 13 ఏళ్ల వయసు విద్యార్థులు 120 మంది పాల్గొని తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల స్థాయిని బట్టి గ్రేడ్‌లుగా విభజించి పోటీలు నిర్వహించారు. గ్రేడ్ 1, 2 తరగతుల విభాగంలో ఎస్‌కె.ఖాజీనా ఖానం, భవానీ, పి.భవ్యశ్రీ, దేవిశ్రీప్రియ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. జూనియర్ కేటగిరిలో దిలీప్ చక్రవర్తి, ఎల్.ధృవిక ఆర్యానా, ఎస్.నిత్యశ్రీ, పి.లిఖిత, సీనియర్ విభాగంలో తస్మియా సబ్రీన్, ఎస్.రక్షిత, వాసియుల్లా సాజిద్, కె.జెస్సికా గ్రేసీ గెలుపొందారు. విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం కథకులు సీతా శ్రీనివాస్ తన మంత్రముగ్ధమైన కథలతో పిల్లలను ఆకట్టుకున్నారు. పిల్లలు ఉత్సాహంగా రైమ్స్, పాటలు పాడారు.

ట్రాఫిక్ పటిష్టతకు కొత్త పరికరాలు

బీచ్ రోడ్డు: నగరంలో ట్రాఫిక్‌ను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు భారీ సంఖ్యలో ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని సీపీ రవిశంకర్ అయ్యర్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషన్ల కోసం కొనుగోలు చేసిన బ్రీత్ ఎనలైజర్స్, వీల్ లాక్స్, బాడీ వార్న్ కెమెరాలు, రేడియం జాకెట్స్, బటన్ లైట్లను శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణకు మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈ పరికారలు ఎంతో దోహపడతాయన్నారు. చాలా మంది యువకులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, దీన్ని అరికట్టేందుకు 200 బ్రీత్ ఎనలైజర్స్‌ను కొనుగోలు చేశామన్నారు. రహదారులపై పార్కింగ్ చేసే వాహనాల కోసం 200 వీల్ లాక్స్‌ను కొనుగోలు చేశామన్నారు. వీటితో పాటు పోలీసుల కోసం 200 బాడీ వార్న్ కెమెరాలు, 400 రేడియం జాకెట్స్, 400 బటన్ లైట్లను కొనుగోలు చేసినట్టు చెప్పారు. డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.


బ్రీత్ ఎనలైజర్స్‌ను ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్

'విశాఖ స్టీవ్‌డోర్స్' కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్షుడు సాంబశివరావు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ఎండీ డాక్టర్ జి.సాంబశివరావును అధ్యక్షుడిగా, ఒరిస్సా స్టీవ్‌డోర్స్ కంపెనీ ప్రతినిధి జేకే నాయక్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గంగిరెడ్డి షిప్పింగ్ కంపెనీ ప్రతినిధి కె.సత్యనారాయణరెడ్డి, ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్స్ ప్రతినిధి జి.రాజేష్, సహాయ కార్యదర్శులుగా బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ ప్రతినిధి ఎన్‌వీజే కిరణ్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సీహెచ్ వెంకట్రావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డి.శ్రీనివాసరెడ్డి(శ్రీనివాస ట్రాన్స్‌పోర్ట్), కె. రోహిత్ (కేఆర్ అండ్ సన్స్), పి.రాహుల్, ఎం. భూపేష్‌ను ఎన్నుకున్నారు.

నోటీస్ బోర్డుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల వివరాలు

ఎంవీపీ కాలనీ: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు నోటీస్ బోర్డుల్లో పొందుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల స్పెషలిస్ట్ వైద్యులతో తన కార్యాలయం నుంచి ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ స్పెషలిస్ట్ వైద్యుల పేర్లు, వారు ఏ రోజు, ఏ సమయంలో ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంటారో కచ్చితంగా నోటీసు బోర్డులో పొందుపరచాలన్నారు. ఆయా వివరాలను ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు తెలియజేయాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా మందులు నిల్వ చేసుకోవడం, వాటిని రోగులకు ఉచితంగా పంపిణీ చేయడం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కేంద్రాల పరిశీలన

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర వ్యయ పరిశీలకురాలు నీనా నిగం, విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకురాలు రెంగ రాజన్, భీమిలి, తూర్పు, దక్షిణ నియోజకవర్గాల వ్యయ పరిశీలకురాలు సౌమ్య పాండే జైన్, ఉత్తర, పశ్చిమ, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల వ్యయ పరిశీలకురాలు అక్తా జైన్‌లు కలెక్టరేట్ సముదాయంలోని వివిధ మానిటరింగ్ కమిటీ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ సేవలు, పరిస్థితులను గమనించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


మానిటరింగ్ కేంద్రాల్లో సేవలను వివరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


హర్షవర్ధన్ మృతదేహం

మద్దిలపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మనస్తాపం చెంది ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం శాంతినగర్–1లో కుటుంబంతో కలిసి నివసిస్తున్న పి.హర్షవర్ధన్ 10వ తరగతి వరకు చదువుకున్నాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. మూడు నెలల కిందట కూడా మనస్తాపంతో ఒకసారి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన అనంతరం సుమారు 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులందరూ డాబా మీద నిద్రపోవడానికి వెళ్లారు. యువకుడు కింద బెడ్ రూమ్‌లో రోజూ మాదిరి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 5 గంటల ప్రాంతంలో వారు నిద్రలేచి కిందకి వచ్చి తలుపులు తీసి చేసేసరికి ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. వారంతా ఇరుగు పొరుగువారి సహాయంతో హర్షవర్ధన్ మృతదేహాన్ని కిందకి దించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.